అభివృద్ధి పనులతో ఆగం

- రోడ్డు విస్తరణ చేయకుండానే డివైడర్ల నిర్మాణం
- ఇరుకుగా మారిన రోడ్డు, పనులు ప్రారంభించి మూడేళ్లు
- తరచూ రోడ్డు ప్రమాదాలు, పదుల సంఖ్యలో మరణాలు


డివైడర్ మధ్యలో అసంపూర్తిగా సెంట్రల్ లైటింగ్ పనులు

చొప్పదండి: మంత్రి వచ్చిండు.. లోకల్ లీడర్లు హడావిడి చేసింద్రు.. రూ.ముప్పైమూడు కోట్లు మంజూరయ్యాయని చెప్పింద్రు.. పెద్ద జులూస్ తీసి శంకుస్థాపన చేసింద్రు.. ఏడాదిలో రోడ్డు విస్తరణ అయితదన్నరు.. ఇప్పటికీ మూడేళ్లు గడిచాయి.. ఆఫీసర్లు కాంట్రాక్టర్లకు కొమ్ముగాసింద్రు.. రోడ్డు విస్తరణ చేయకుండానే డివైడర్లు కట్టింద్రు.. ఉన్న రోడ్డును చిన్నగా జేసి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నరు.. ఒక్కోసారి రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడుతున్నారు.. గవర్నమెంటు మారింది.. గత ప్రభుత్వానికి చాతగాలె.. మేమన్నా పూర్తి జేసి సూపిత్తమన్నరు.. ఏడాది దాటింది.. రోడ్డు విస్తరణకు మాత్రం నోచుకోలే.. ఇంకెన్ని మరణాలు చూడాల్నో.. అంటు చొప్పదండి పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చొప్పదండి మున్సిపాలిటిలో రూ.33 కోట్లతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతోపాటు రోడ్డును వందఅడుగులకు విస్తరిస్తామని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మూడేళ్లు గడిచాయి. అసెంబ్లీ ఎన్నికలకు ఏడాదిన్నర ముందే అప్పటి మంత్రి హోదాలో కేటీఆర్ శంకుస్థాన చేయడంతో అసెంబ్లీ ఎన్నికల వరకు పెద్ద పట్టణాలకు ధీటుగా సెంట్రల్ లైటింగ్ చూడవచ్చని పట్టణ ప్రజలు అనుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆగమాగం పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు అప్పటి లీడర్ల ఒత్తిడితో రోడ్డును విస్తరించకుండానే డివైడర్లు నిర్మించారు. మట్టిరోడ్డు గుంతలుగా మారి రోడ్డుపై అక్రమ పార్కింగ్ చేస్తూ వ్యాపారులు తిష్ట వేయడంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒక్కో ప్రమాదంలో ఇద్దరు నుంచి ముగ్గురు మృత్యువాత పడుతున్నారు. యువకులు బైక్ ప్రమాదంలో చనిపోతున్నా అధికారులు, నాయకుల్లో మాత్రం చలనం రావడం లేదు. ఏడాదిన్నరగా పనులు పడకేసినా ప్రేక్షక పాత్ర వహించడం మినహా ప్రమాదాల నివారణకు, రోడ్డు పనుల పూర్తికి చర్యలు చేపట్టడం లేదు. పట్టణ పరిధిలోని జాన్సీ విద్యాలయం నుంచి నవోదయ విద్యాలయం వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర సెంట్రల్ లైటింగ్ పనులకు రూ.33 కోట్లు మంజూరయ్యాయని అప్పటి అధికారులు ప్రకటించారు. ఈ మేరకు రుణం మంజూరైందని ప్రకటించినా జీఎస్టీ, ఇతర పన్నులు పోను రూ.23 కోట్లు మంజూరయ్యాయని ప్రచారం జరిగింది. అందులోనూ మురుగుకాలువలు పూర్తి చేయించిన అధికారులు తారురోడ్డు విస్తరించడం విస్మరించి డివైడర్‌ను పూర్తి చేయించారు. ప్రభుత్వం మారడంతో రుణం ఆగిపోయి, కాంట్రాక్టర్లకు బిల్లులు రాక పనులు పెండింగ్‌లో పెట్టారు. ఇటీవల కరెంట్ స్తంభాలు నిలబెట్టినా మళ్లీ పనులు నిలిచిపోయాయి. అసంపూర్తి రోడ్డు పనులతో యువత ప్రాణాలు కోల్పోతున్నారు. రాత్రివేళ మట్టిరోడ్లపై నుంచి పడటం లేదా ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొనడం, రోడ్డుపై వెళ్లే వారిని ఇతర వాహనాలు ఢీకొనడం వంటి సంఘటనల్లో ఇప్పటికే పదుల సంఖ్యలో మరణాలు నమోదయ్యాయి. రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టకపోవడంతో మరణాల సంఖ్య పెరుగుతూ వస్తోంది.


సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న అప్పటి మంత్రి కేటీఆర్ (ఫైల్)

పనులు పూర్తి చేస్తాం

తారురోడ్డు పనులు పూర్తి చేయాల్సి ఉంది. పెండింగ్ బిల్లులు కొంతభాగం మంజూరైతే చెల్లించాం. కాంట్రాక్టర్లు పనులు ప్రారంభిస్తామన్నారు. రోడ్డు విస్తరణ జరిగితే ప్రమాదాలను నివారించడంతోపాటు ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– కీర్తి నాగరాజు, మున్సిపల్ కమిషనర్, చొప్పదండి

హోరాహోరీగా రాష్ట్రస్థాయి హాకీ పోటీలు


క్రీడాకారులతో హాకీ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు

హుజూరాబాద్: పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో సోమవారం కరీంనగర్ వర్సెస్ మెదక్, హైదరాబాద్ వర్సెస్ నిజామాబాద్ జట్లు సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. మంగళవారం ఉదయం ఏడు గంటలకు సెమీఫైనల్స్ నిర్వహించనున్నామని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ తోట రాజేంద్రప్రసాద్, హుజూరాబాద్ హాకీ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి గనిశెట్టి ఉమామహేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా హాకీ అసోసియేషన్ సెక్రటరీ సర్దార్ సురేందర్ సింగ్, జిల్లా ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు పవన్ కుమార్, చింత శ్రీనివాస్, భూసారపు శంకర్, వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి శ్రీనివాస్, భీమగోని సురేష్, టి శ్రీనివాస్, బి తిరుపతి గౌడ్ వేముల రవికుమార్, శ్యాంసుందర్, సజ్జు, రమేష్, సాయికృష్ణ, రాజేష్, విక్రం, సాంబ, కరీంనగర్ జిల్లా జట్టు కోచ్ ఎం రాజేష్, మేనేజర్ వినయ్ పాల్గొన్నారు.

సన్మానం

హుజూరాబాద్: హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, ప్రధాన కార్యదర్శి కామని రవీందర్‌ను పట్టణంలోని ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ, జీకే రైతుమిత్ర సమన్వయ సమితి నాయకులు గూడూరు స్వామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసే జర్నలిస్టుల వృత్తి గొప్పదన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కొత్త అధ్యక్ష, కార్యదర్శులు కృషి చేయాలని కోరారు. ఆర్టీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణమూర్తి తులసి, చంద్రశేఖర్, జనార్దన్ రెడ్డి, కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలరావు, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి స్వామి తదితరులు పాల్గొన్నారు.

నియామకం

హుజూరాబాద్: పట్టణానికి చెందిన ఆలేటి సుశీలను హుజూరాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమిస్తూ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డికి నియామక ఉత్తర్వులు అందజేశారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత మొగిలిరావు ఆదేశాల మేరకు నియమించామన్నారు. సోమవారం హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌ను కలిసి నియామకపత్రం అందుకున్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా, పట్టణ నాయకులకు సుశీల కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

రామడుగు: రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకం కింద మండలంలోని మహిళా రైతులకు సబ్మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్ స్కీం క్రింద పనిముట్లు అందజేయనున్నామని మండల వ్యవసాయాధికారి త్రివేదిక తెలిపారు. పవర్ ఆపరేటర్, బ్యాటరీ స్ప్రేయర్స్, రోటవేటర్లు, ట్రాక్టర్ ఇంప్లిమెంట్స్ మంజూరయ్యాయని, పనిముట్లు అవసరమున్న మహిళా రైతులు ఈ నెల 19 వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, ఆధార్‌కార్డు, పాస్‌బుక్, జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్‌ఫొటో, వ్యవసాయ విస్తరణాధికారితో దరఖాస్తుపై సంతకం చేయించి అందజేయాలని సూచించారు.

గంగాధర: మండలంలోని చిన్న,సన్నకారు మహిళా రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేయనున్నట్లు ఏడీఏ ప్రియదర్శిని తెలిపారు. గంగాధర వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలోని రామడుగు, గంగాధర, చొప్పదండి మండలాల మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎకరం భూమి, మూడేళ్లలో లబ్ధిపొందని రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వర్మీకంపోస్ట్ తయారీపై అవగాహన

హుజూరాబాద్: మండలంలోని ఆయా గ్రామాల్లో వందరోజుల పని పూర్తి చేసుకున్న ఉపాధి హామీ కుటుంబ సభ్యులకు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం వర్మీకంపోస్టు తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమం డీఆర్డీఏ, జమ్మికుంట కేవీకే ఆధ్వర్యంలో నిర్వహించారు. ట్రైనింగ్ కోఆర్డినేటర్ అనూష, నాగశ్రీ 44 కుటుంబాలకు తయారీ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, ఏపీవో చంద్రశేఖర్, టీఏ రాజేందర్ ఉన్నారు.

సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న కంకణాల రమేశ్‌రెడ్డి

హుజూరాబాద్: ప్రతి గ్రామంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించేలా విశ్వహిందూ పరిషత్ నాయకులు బాధ్యత తీసుకోవాలని వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు కంకణాల రమేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కనుకులగిద్దె గ్రామంలో సోమవారం వివిధ గ్రామాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. కల్యాణం రోజు ప్రతి ఇంటిపై కాషాయ జెండా ఎగరేయాలన్నారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ మండల కార్యదర్శి చంద్రయ్య, మాందాడిపల్లి అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, జూపాక అధ్యక్షుడు సురేశ్, రాంపురం అధ్యక్షుడు కిషన్ వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం


చీరలు పంపిణీ చేస్తున్న స్వప్న, అధికారులు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో హోలీ పండుగ పురస్కరించుకొని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పూల్లారి స్వప్న సదానందం మార్కెట్‌లో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి సోమవారం చీరలు పంపిణీ చేశారు. మహిళలు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఉన్నత శ్రేణి కార్యదర్శి మల్లేశం, గ్రేడ్ కార్యదర్శి రాజా, సిబ్బంది పాల్గొన్నారు.

కేసు నమోదు చేయాలి

శంకరపట్నం: సోషల్ మీడియాలో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎన్ఆర్ఐ పులుసు రవి అనుచిత వ్యాఖ్యలు పోస్టు చేశారని ఆరోపిస్తూ కేశవపట్నం పోలీస్ స్టేషన్‌లో ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఆయాన్ సోమవారం ఫిర్యాదు చేశారు. రవిపై కేసు నమోదు చేయాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


జమ్మికుంటలో ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

హుజూరాబాద్: న్యాయమైన హామీలను ప్రభుత్వం పరిష్కరించాలని సోమవారం ఆశవర్కర్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ.. ఆశవర్కర్లకు రూ.18 వేల వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఉద్యోగ భద్రత, ఇన్సూరెన్స్, పదోన్నతులను కల్పించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు.

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లతో వెట్టి చాకిరి చేయిస్తోందని కొప్పుల శంకర్ అన్నారు.

సైదాపూర్: ఫిక్స్‌డ్ వేతనాలు ఇవ్వాలని తహసీల్దార్ మంజులకు వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఆశా కార్యకర్తల సంఘం మండల అధ్యక్షురాలు శ్యామల ప్రభుత్వాన్ని కోరారు.

చిగురుమామిడి: ఆశా వర్కర్లు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని నయాబ్ తహసీల్దార్ స్వరూపారాణికి అందించారు

శంకరపట్నం: తహసీల్దార్ కార్యాయం ఎదుట ఆశా కార్యకర్తలు ఆందోళన చేపట్టి తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందించారు.

'రసమయి ఆరోపణలు అవాస్తవం'

తిమ్మాపూర్: మానకొండూర్ నియోజకవర్గంలో రూ.6 కోట్ల సీఎంఆర్ఎఫ్ కుంభకోణం జరిగిందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేసిన ఆరోపణలు అవాస్తవమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఎల్ఎండీ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రసమయి వ్యాఖ్యలు, ఆరోపణలను యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి ఖండించారు. బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎల్వోసీల మంజూరులో అవినీతికి తావు లేదన్నారు. కాంగ్రెస్ నాయకులను రసమయి కుక్కలతో పోల్చడంపై సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్ అలువాల కోటి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో కమీషన్లకు తెరలేపింది రసమయి బాలకిషనేనని ఇల్లంతకుంట మాజీ ఎంపీపీ ఊట్కూరి వెంకటరమణారెడ్డి అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎల్ గౌడ్, తుమ్మన పల్లి శ్రీనివాస్‌రావు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిధులు ఇప్పించాలని వినతి


ప్రణవ్‌కు వినతిపత్రం ఇస్తున్న లబ్ధిదారులు

హుజూరాబాద్: రెండో విడుత దళితబంధు నిధులు ఇప్పించాలని లబ్ధిదారులు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌కు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. రెండో విడుత నిధులు ఆగిపోవడంతో వ్యాపార నిర్వహణ ఇబ్బందిగా మారిందన్నారు. అనంతరంల ప్రణవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు నిధుల మంజూరు కట్టుబడి ఉందని, మంత్రి పొన్నం ప్రభాకర్ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి విషయం తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బస్సు సర్వీస్ పునరుద్ధరించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జమ్మికుంట: జమ్మికుంట నుంచి హైదరాబాద్‌కు బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని సీపీఎం జమ్మికుంట మండల సహాయ కార్యదర్శి వడ్లూరి కిషోర్ హుజూరాబాద్ డిపో మేనేజర్ రవీంద్రనాథ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. జమ్మికుంట మున్సిపల్, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు విద్య, వైద్యంతోపాటు వివిధ అవసరాల కోసం నిత్యం హైదరాబాద్‌కు వెళ్తుంటారని, గతంలో హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం ఉండేదని, బస్సు సర్వీస్‌ను రద్దు చేయడంతో మూడేళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నార తెలిపారు. ఆరునెలల కితం రాష్ట్ర సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జమ్మికుంట పర్యటన సందర్భంగా హామీ ఇచ్చారని, బస్సు పునఃప్రారంభం కాలేదని విన్నవించారు. సర్వీసు కొనసాగకుంటే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, అరవింద్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బీజేపీ నాయకులు సోమవారం ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, రమేశ్, శరత్‌కుమార్, మామిడి రమేశ్, దినేష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, తిరుపతి, బండి సందీప్, మామిడి అనిల్, పెసరు పర్శరాములు, అంజి, జంగా శ్రీనివాస్‌రెడ్డి, రజనీకాంత్, అజయ్, వరుణ్, రాహుల్, సాయి పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు..


పనులు ప్రారంభిస్తున్న నాయకులు, గ్రామస్తులు

జమ్మికుంట: మండలంలోని జగ్గయ్యపల్లి పంచాయతీ పరిధిలోని రంగమ్మపల్లి ఎర్రగట్టు భక్తాంజనేయస్వామి దేవస్థానం, శివాలయం వద్ద సీసీరోడ్డు నిర్మాణ పనులను గ్రామస్తులు సోమవారం ప్రారంభించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, మాజీ జెడ్పీటీసీ శ్రీరామ్‌శ్యాం మాట్లాడుతూ సీసీ రోడ్డు పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ నిధులు మంజురు చేశారని గుర్తు చేశారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, బండి సంజయ్‌కు సహకారంతో హుజూరాబాద్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో గుడి చైర్మన్ సంపత్‌రావు, మాజీ ఉపసర్పంచ్ హేమశంకర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

తిమ్మాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లుకు అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదం తెలుపడంతో కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మిఠాయిలు పంచుకుంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రావు, అనిల్ కుమార్, శ్రీనివాస్, అలువాల కోటి, వెంకట రమణారెడ్డి, పులి కృష్ణ, అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, ఆకుల సత్యం తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో ఉద్యోగుల సేవలు అభినందనీయం

- కలెక్టర్ పమేలా సత్పతి


డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్: ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలులో అన్ని కేటగిరీలకు చెందిన ఉద్యోగుల సేవలు అభినందనీయమని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఎల్ఎండీ కాలనీలోని సీఈ కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం డైరీని సోమవారం ఆవిష్కరించారు. ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. నిర్దేశించిన పని పూర్తి చేయడంలో ఉద్యోగులు ముందువరుసలో ఉంటారని అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఏ.సత్యనారాయణ, టీజీవోస్ జిల్లా అధ్యక్షులు మడిపల్లి కాళీ చరణ్, ప్రధాన కార్యదర్శి అడ్ల రవీందర్ రెడ్డి, టిఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర నాయకులు శ్యామ్, లక్ష్మణరావు పాల్గొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కామన్ డైట్ మెనూ కచ్చితంగా పాటించాలని కలెక్టర్ అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి సందర్శించారు. వసతులను పరిశీలించారు. వంట, సరుకుల స్టోరేజీ గదులు తనిఖీ చేశారు. శుభ్రత పాటించాలని, నాణ్యతతో భోజనం తయారు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నిర్దేశించిన కంపెనీలకు చెందిన స్టాక్‌ను మాత్రమే వినియోగించాలన్నారు. బాలికలతో కలసి భోజనం చేశారు. ఆహారం రుచి, నాణ్యత, ప్రతిరోజు ఏ సమయానికి ఏయే ఆహారం ఇస్తున్నారని విద్యార్థులను అడిగారు. కామన్ డైట్ మెనూ ప్రకారం విద్యార్థులకు అన్ని రకాల పోషకాహారం అందజేస్తున్నారని తెలిపారు. వివిధ రకాల విటమిన్ల, ప్రోటీన ఆహారాన్ని కచ్చితంగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరిత, తదితరులు పాల్గొన్నారు


చొప్పదండి: డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు



జమ్మికుంట: కోరపల్లిలో...


శంకరపట్నం: మొలంగూర్‌లో...

వీడ్కోలు హంగామా

చొప్పదండి: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గుర్రం నీరజ అన్నారు. సోమవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో దీక్షితుల శ్రీనివాస్, ఇప్పనపల్లి సాంబయ్య, వైద్యుల రాజిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా ఎంఈవో హేమలత మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన సుశిక్షితులైన ఉపాధ్యాయలు ఉన్నారని పేర్కొన్నారు. పది ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.లక్షరూపాయల నగదు బహుమతిగా అందజేస్తానని హెచ్‌ఎం మిడిదొడ్డి సమ్మయ్య హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అందరిని అకట్టుకున్నాయి.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్సెస్సీ విద్యార్థులకు వీడ్కోలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అధికారుల పొలంబాట

గంగాధర: మండలంలోని ఆచంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్‌శాఖ అధికారులు సోమవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ వినియోగంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజినీర్ మేక రమేశ్, డివిజనల్ ఇంజినీర్ తిరుపతి, ఏడీఈ సత్యనారాయణ, శీలం ప్రశాంత, ఏఈ తోట రామ్మోహన్ సిబ్బంది పాల్గొన్నారు. వేసవిలో విద్యుత్ డిమాండ్ తీర్చడంతోపాటు సమస్యల నివారణ, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొత్తగా లెవన్ కేవీ బంచుడు బ్రేకర్స్ ఏర్పాటు చేసి ప్రారంభించారు.

పిల్లలకు వైద్యపరీక్షలు

చిగురుమామిడి: చిగురుమామిడి శివారులోని పౌల్ట్రీ ఫామ్‌లో పనిచేస్తున్న వలస కూలీల పిల్లలకు సోమవారం పీహెచ్‌సీ సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ ఏంజెల్‌ప్రిసీల నేతృత్వంలో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. పిల్లల తల్లిదండ్రులకు వివిధ పరీక్షలు చేశారు. సూపర్‌వైజర్ చంద్రకళ, ఏఎన్ఎం స్వరూపారాణి, అంగన్‌వాడీ టీచర్లు ధనలక్ష్మి, అనురాధ, సీఆర్పీ బి. ఆంజనేయులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉండాలి

హుజూరాబాద్: వార్డుల్లోని ప్రజలు చెత్తను ఆరుబయట వేయొద్దని పరిసరాల శుభ్రతను పాటించాలని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అన్నారు. పట్టణంలోని 22వ వార్డులో సోమవారం స్వచ్ఛ సర్వేక్షన్ 2025 కార్యక్రమంలో భాగంగా ప్రజలకు పరిసరాల శుభ్రత, తడి, పొడిచెత్త వేరు చేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలందరి సమష్టి కృషితో పట్టణానికి స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు వస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు కౌన్సిలర్ పైళ్ల వెంకట్‌రెడ్డి, శానిటరి ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు, జవాన్ సుధీర్ ఉన్నారు.

నిరసనలో ఉద్రిక్తత

చొప్పదండి: కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి చిత్రపటాలను కాంగ్రెస్ నాయకులు దహనం చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకుల క్షీరాభిషేక కార్యక్రమం చేపట్టగా ఉద్రిక్తతకు దారితీసింది. సీఐ ప్రకాశ్ గౌడ్ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి నాయకులను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. నాయకులు ప్రతిఘటించడంతో తోపులాట జరిగింది. అనంతరం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వారిని విడిపించారు.

వర్గీకరణ అమలయ్యే వరకు ఉద్యమం ఆగదు


నిరసన దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కరీంనగర్: ఎస్సీ వర్గీకరణ అమలయ్యే వరకు ఉద్యమం ఆగదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన దీక్ష సోమవారం 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ మాదిగల 70 ఏళ్ల ఆకాంక్ష అన్నారు. వర్గీకరణ లేకపోవడం వల్లనే మాదిగ జాతి విద్య, ఉద్యోగాల్లో తీవ్రంగా నష్టపోయిందని తెలిపారు. వర్గీకరణ సాధించడమే లక్ష్యంగా మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు. ఈ ఉద్యమాన్ని దెబ్బతీయాలని పాలకులు ఎన్ని కుట్రలు చేసినా వాటిని ఛేదించి మందకృష్ణ మాదిగ కాపాడుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొమురన్న, అంజయ్య, శంకర్, సుదర్శన్, వరలక్ష్మి, బాబు, సంపత్, అజయ్, లక్ష్మణ్, రాజమల్లు, రాకేశ్, దివాకర్, సునీల్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

హుజూరాబాద్: అసెంబ్లీ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు అమోదం జరిగేలా చూడాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీస్, ఎంఎస్పీ నాయకులు చేపట్టిన దీక్ష ఆరో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు లోబడి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలుపై సీఎం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. నిరసనలో నాయకులు తునికి వసంత్, సాల్లు బాబు,తునికి సమ్మయ్య, బొరగాల సారయ్య, ఎర్ర శ్రీధర్, మహమ్మద్ రఫీ, అందాసి నారాయణ, ఎర్ర రాజ్ కుమార్, బుడగ జంగాల నాయకుడు సిరిపాటి వేణు, మొలుగు శ్రీనివాస్,వేల్పుల భాస్కర్, దేవునూరి రవీందర్, కుమ్మరి అనిల్, లంకదాసరి తిరుపతి పాల్గొన్నారు.